బ్యాంకుల ద్వారా పింఛన్లు

విశాలాంధ్ర - కే.కోటపాడు: ఈనెల వృద్ధాప్య, వితంతు పింఛన్లు వారి యొక్క బ్యాంకు అకౌంట్లకు నేరుగా జమ చేయడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో కే.అప్పలరాజు తెలిపారు. సోమవారం మండల పరిషత్ సమా వేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంక్ అకౌంట్ ఉన్న వారందరికీ ఒకటో తేదీనే పింఛన్లు జమ చేయడం జరుగుతుందని బ్యాంక్ అకౌంట్ లేనివారికి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు నేరుగా వారి ఇళ్ల వద్దే పింఛను అందించడం జరుగుతుందన్నారు. కావున పింఛన్‌దారులు ఆయా గ్రామ సచివాలయాలకు రానక్కర్లేదని ఈ విషయం గ్రామాల్లో దండోరా ద్వారా తెలియపరచాలని కార్యదర్శులను ఆదేశించారు.

ఇండియా కూటమి గెలుపు అనకాపల్లి అభివృద్ధికి మలుపు

దోపిడీదారు సీఎం రమేష్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి | కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గడిచిన పదేళ్లుగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ వెనక్కి నెట్టేసిన కూటమి ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంక టరమణ పిలుపునిచ్చారు. ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో జిల్లా కేంద్రంలో గల రోటరీ కల్యాణ మండపంలో సీపీఐ ఆత్మీయ సమా వేశం సోమవారం నిర్వహించింది. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి హాజరై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు ఏకమై దేశాన్ని రాష్ట్రాన్ని ఏ విధంగా నాశనం చేస్తు న్నాయో వివరించారు. సభకు అధ్యక్షత వహించిన బాలేపల్లి వెంకటరమణ మాట్లా డుతూ జిల్లాలో రాజకీయ ముసుగు ధరించి దోపిడి దొంగలు హల్‌చల్ చేస్తున్నారని వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. టీడీపీలో ఉంటూ బ్యాంకులను మోసం చేసి, పనులు చేయకుండానే చేసినట్లు 800 కోట్లు కాజేసిన సీఎం రమేష్ లాంటి వ్య క్తులు కేసులు భయంతో బిజెపిలో చేరి ఇప్పుడు అనకాపల్లి పార్లమెంటు సభ్యులుగా పోటీ చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అన్నారు. సీఎం రమేష్‌ను చిత్తుగా ఓడించాల ని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామ నాయుడు, రాజాన దొరబాబు, సిపిఐ నాయ కులు వై.ఎన్.భద్రం, కోరుబిల్లి శంకర్రావు, తాకాశి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి చంద్రబాబు, పవన్ పొత్తు...జగన్ తొత్తు

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను అమలు చేస్తున్న మతోన్మాద బీజేపీని గద్దె దించాలి. బీజేపీతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పొత్తు పెట్టుకుంటే, జగన్మోహన్ రెడ్డి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ అన్నారు. పది సంవత్సరాలుగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. మెరుగైన విద్యా, వైద్యం లేక జిల్లా ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం ప్రత్యేక హోదాపైనే పెడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా జిల్లాలోని అన్ని షుగర్ ఫ్యాక్టరీలను అభివృద్ధి బాటలో పయనింపచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్రాన్ని మోడీకి తాకట్టు పెట్టిన బాబు, జగన్

తమ వ్యక్తిగత అవసరాలు, స్వార్థం, కేసులకు భయపడి చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి, పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని మోడీకి తాకట్టు పెట్టారని మాడుగుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.శ్రీనివాసరావు ఘాటుగా విమర్శించారు. వ్యవస్థలను అస్తవ్యస్తం చేసి అన్ని రంగాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వ్యక్తిగత స్వార్థంతోనే కాంగ్రెస్‌కు కొణతాల దూరం

రాజకీయ జీవితం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ద్రోహం చేశారని అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి హయంలో మూడు మంత్రులు పదవులు అనుభవించిన కొణతాల కూటమిలో భాగస్వామ్యమవడం దారుణం అన్నారు. అనకాపల్లిలో అవినీతిని పరుగులెట్టించిన గుడివాడ అమర్నాథ్‌ను ఇక్కడి ప్రజలు ఓడిస్తారనే భయంతోనే గాజువాకకు మార్చారని ఇక్కడ కనీస రాజకీయ అనుభవం లేని యువకుడికి టికెట్ ఇచ్చి అవహాస్యం చేశారని ఆరోపించారు.

ఈ దేశానికి కాంగ్రెస్ అవసరం



ఈ దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ అవసరం ఎంతైనా ఉందని పాయకరావుపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బోని తాతారావు అన్నారు. దేశంలో మోడీ మరొక్కసారి వస్తే రావణ కాష్ట అవుతుందని హెచ్చరించారు. తుఫానుకు ముందు నిశ్శబ్దంలాగా మోడీ మరలా వస్తే దేశ భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుంది అన్నారు. దేశం కోసం అందరిలో మార్పు రావాలని ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడాలని అందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ గెలుపు... దేశం గెలుపు

అవినీతిని సైతం లీగలైజ్ చేసుకొని పది సంవత్సరాలుగా అరాచక పాలన సాగిస్తున్న బిజెపికి ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు బుద్ధి చెప్పాలని నర్సీపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రుత్తల శ్రీరామ్ మూర్తి పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ గెలిస్తే సిద్ధాంతాలు గెలిచినట్లేనని అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టిన బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ రాజకీయ స్థితి గతులను తనకు అనుకూలంగా మార్చుకొని కోట్లాది రూపాయల అవినీతి సొమ్మును కూడబెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే సీఎం రమేష్ డబ్బుకు బలం లేదన్నారు.

కాంగ్రెస్ సామాన్యుల పార్టీ

బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆలోచించే కాంగ్రెస్ పార్టీతో ఇండియా కూటమి రూపంలో జతకట్టి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడుతున్న సిపిఐ, సిపిఎం మిగతా పార్టీల సహకారంతో ఎన్డీఏకు బుద్ధి చెప్పాలని చోడవరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జగతా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని ఇండియా కూటమికి ప్రజలు పట్టం కట్టాలని కోరారు.

ప్రత్యేక హోదాపై నిలదీయండి

విభజన చట్టంలో ఉన్న హామీలను అమలు చేయ కుండా ఓట్లు అడగడానికి వస్తున్నా కూటమి నాయకులను నిల దీయాలని ఎల మంచిలి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంతరావు పిలుపునిచ్చారు. ఈ దేశాన్ని నిర్మించిన కాంగ్రెస్ పార్టీ వల్లే రాజ్యాంగం పరిరక్షించబడుతుందని తెలిపారు. పోలవరం, స్టీల్ ప్లాంట్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల ప్రత్యేక ప్యాకేజీలపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

యలమంచిలి అసెంబ్లీ బరిలో 14 మంది అభ్యర్థులు

విశాలాంధ్ర - ఎలమంచిలి రూరల్: ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగియడంతో ఎలమంచిలి అసెంబ్లీ బరిలో 14 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ ప్రక్రియలో మొత్తం 18 మంది దాఖలు చేయగా వారిలో నలుగురు అభ్యర్థులను ఎన్నికల అధికారులు పలు కారణాలతో తిరస్కరించారు. దీంతో ప్రధాన పార్టీలైన వైసీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీతో పాటు బహుజన సమాజ్ పార్టీ, పిరమిడ్ పార్టీ, నవరంగ కాంగ్రెస్ పార్టీ, జై భారత్ నేషనల్ పార్టీ, రెఫర్మ్ పార్టీ ఆఫ్ ఇండియా తదితర పార్టీలతో మరో ఆరుగురు అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఎన్నికల బరిలో నిలిచిన 14 మంది అభ్యర్థుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు.

వైసీపీ నుంచి ఉప్పలపాటి వెంకటరమణమూర్తి రాజు కన్నబాబు, జనసేన పార్టీ నుంచి సుందరపు విజయ్ కుమార్, జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి అనంతరామ నర్సింగరావు, బహుజన సమాజ్వాది పార్టీ నుంచి లంబ శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బి.అమ్మజమ్మ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి సుందరపు అర్జున్ కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దాడి పూర్ణచంద్రరావు, రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బి.నాగేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా ఎరుపల్లి కాసులు, ప్రగడ అన్నపూర్ణ బొత్స శ్యామల, నేడు రాజబాబు, మొల్లేటి రమేష్, సుందరపు రవికుమార్లు ఉన్నారు. మొత్తం ఎలమంచిలి నియోజకవర్గంలో 2,06,394 ఓటర్లు ఉండగా వారిలో 1,00,407 పురుష ఓటర్లు కాగా 1,05,978 మహిళా ఓటర్లు 9 మంది ఇతరులు ఉన్నారు. కాగా 5571 మంది మహిళా ఓటరుల పురుషుల కంటే అధికంగా ఉన్నారు.

ప్రజా సంక్షేమమే జగన్ లక్ష్యం: కంబాల జోగులు

విశాలాంధ్ర - యస్.రాయవరం: ప్రజా సంక్షేమే ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం అని పాయకరావుపేట వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. సోమవారం మండలంలో గుర్రాజుపేట, పెద ఉప్పలం, గుడివాడ, తిమ్మాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో హామీలు అమలు చేయడంతో పాటు కొత్తగా ఇచ్చిన మేనిఫెస్టోలో అమలు చేసే పథకాలను ప్రకటించడం జరిగిందన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వైసిపి తరఫున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, వైస్ ఎంపీపీ అప్పన్న, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు మాతా గురునాథరావు, వైసీపీ సీనియర్ నాయకులు మధు వర్మ, శ్రీపతి రాజు, అల్లాడ నాగరాజు, రాజా రమేష్, సర్పంచులు ధూళి శీను బాబు, కర్రీ సత్యనారాయణ, కోశెట్టి రమణ,మల్లె లోవరాజు, గాడి బుజ్జి, మండల వైసిపి యువజన అధ్యక్షుడు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థాయి మించి మాట్లాడితే సహించేది లేదు

విశాలాంధ్ర - గొలుగొండ: తెలుగుదేశం పార్టీ నాయకుడు నర్సీపట్నం నియోజవర్గం అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడును చేరికలు పేరుతో మోసం చేస్తున్నారని విశ్వబ్రాహ్మణులు కొంతమంది చేసిన ప్రచారంలో వాస్తవం లేదని పాపారావు, ఆనంద్, వరహాలు పేర్కొన్నారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీసం పార్టీలో ఎటువంటి పదవి కూడా లేని వ్యక్తి విశ్వబ్రాహ్మణులు అందరి గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదని తెలిపారు. ఏ అర్హత ఉండి కొంతమంది విశ్వబ్రాహ్మణులపై ప్రకటనలు ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఒక వ్యక్తిగా నీ గురించి నీ కుటుంబం గురించి చూసుకోవాలి కానీ గ్రామంలో ఉండే విశ్వబ్రాహ్మ ణులందరికీ మాట్లాడే అర్హత నీకు లేదని రాజకీయం ఎవరి వ్యక్తిత్వానికి వారిదే దీనికి కులాన్ని వాడితే మాత్రం ఎంత మాత్రం మర్యాదగా ఉండ దన్నారు. అదే టిడిపి ప్రభుత్వంలో గ్యాస్ సిలిండర్ చిత్ర మిషన్ అందుకున్న వ్యక్తివి నీవు కూడా మాట్లాడే వ్యక్తివే నా అంటూ విరుచుకుపడ్డారు. ముఖ్యంగా కామాక్షమ్మ గుడి వెనక్కి వెళ్ళిపోయినప్పుడు అధికార పక్షంలో ఉండి ఏం చేస్తున్నావు అంటూ సూటిగా ప్రశ్నించారు. ఏ ఊరు నుంచి అయినా బ్రతుకుతెరువుకు వచ్చిన వాళ్ళని అవహేళన చేసే తత్వం మానుకుంటే నీకు చాలా మంచిదని మీయొక్క స్వార్థపూరిత రాజకీయం నచ్చకే కొంతమంది మరలా సొంత గూటికి టిడిపిలో చేరికలు జరిగాయని విశ్వబ్రాహ్మణ పెద్దలు టిడిపి కార్యకర్తలు ఈ సందర్భంగా తెలియజేశారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రచారం

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం యాదవ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడుకు, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు మద్దతుగా ప్రచారాన్ని ప్రారంభించారు. సోమవారం గొలుగొండ మండలంలోని పోలవరం, ఎరకంపేట, అమ్మపేట, చోద్యం, ఏ ఎల్ పురం, పాత కేడీపేట ఎర్రవరం గ్రామాలలో నర్సీపట్నం యాదవ సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి నరసింగరావు యాదవ్ (వంశీ మాస్టర్) మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. నర్సీపట్నం నియోజకవర్గాన్ని అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యాదవులకు సముచిత స్థానం కల్పిస్తామని అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ ప్రచారంలో తెలుగు యాదవ మహాసభ అధికార ప్రతినిధి పిల్లా వెంకటేశ్వరరావు యాదవ్, నర్సీపట్నం యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి నూకరాజు యాదవ్, టిడిపి నాయకులు పక్కుర్తి వెంకటరమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గెడ్డం బుజ్జిని పరామర్శించిన సీఎం రమేష్

విశాలాంధ్ర - నక్కపల్లి: అనకాపల్లి జిల్లా జనసేన పార్టీ నాయకులు గెడ్డం బుజ్జిని అనకాపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ పరామర్శించారు. శనివారం రాత్రి రోడ్డు బుజ్జి ప్రమాదానికి గురైన సంఘటన తెలిసినదే.! విశాఖపట్నం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుజ్జి ఆరోగ్యంగా కోలుకోవాలని జనసేన పార్టీ కార్యకర్తలు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. త్వరగా కోలుకోవాలని సీఎం రమేష్ బుజ్జిని ధైర్యం చెబుతూ ఆకాంక్షించారు.

ఉపాధి హామీ కూలీలతో సమావేశం

విశాలాంధ్ర - మునగపాక: మండల ప్రాంతం చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో ఎలమంచిలి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్‌ను, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపించాలని సమావేశం ఏర్పాటు చేసి సుందరపు శైలజ కోరారు. వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ప్రతి ఒక్కరూ గ్లాస్ గుర్తుకు, కమలం పువ్వుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, కాండ్రేగుల నాయుడు, కాండ్రేగుల రామ నాగేశ్వరరావు, కాండ్రేగుల శంకర్, ఎల్లపు శ్రావణ్ కుమార్, ఆడారి ప్రసాద్, సంజయ్, పోలమరశెట్టి మురళి, కోడేల నూకరాజు, మాజీ జెడ్పిటిసి ఆడారి సరోజిని, ఆడారి జానకి, స్రవంతి, సరస్వతి పాల్గొన్నారు.

గోపాలపట్నంలో అనిత ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మండలంలోని గోపాలపట్నం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, ఎంపీటీసీ కలిదిండి సతీష్ రాజు ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా వేసి వంగలపూడి అనిత పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు జరగాలంటే కూటమి అధికారంలోకి రావాలని, సైకిల్ గుర్తుపై తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రాంతానికి పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి దొరకాలంటే కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, బొంది కాశీ విశ్వనాథ్, కంకిపాటి వెంకటేశ్వరరావు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, యాళ్ళ వరహాల బాబు, గూటూరు శ్రీనివాసరావు, చిక్కాల శ్రీను, గణపర్తి రాజబాబు, గణపర్తి దొర, చింతకాయల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - పరవాడ: ఎన్డీఏ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి రావాడలో ఇంటింటి ప్రచారం చేశారు. కూటమి మేనిఫెస్టో పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. గ్లాసు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబును, కమలం గుర్తుపై ఓటేసి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మాజీ వైస్ సర్పంచ్ మరిశా అప్పలరాజు, వార్డు మెంబర్లు తోట బాబూరావు, మోటూరి హరిబాబు, నాయకులు సాలాపు రమణ, వియ్యపు సూర్యచంద్రప్పారావు, మరిశా శ్రీనివాసరావు, కోన కృష్ణ, మోటూరి సూరిబాబు, చుక్క తాతారావు, మరిశా అప్పలరాజు, కోన రాము, మోటూరు కాశి, తోట రాము, దాలిపోయిన సంజీవరావు, మోటూరి వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మేడిచేర్ల గ్రామంలో మెయిన్ రోడ్ పక్కన ఉన్న పాలకేంద్రం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యతో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ఈ శిబిరంలో 75 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 36 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ దుర్గ భవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆడినేటర్ సిహెచ్ అశ్వని కుమార్, నర్సింగ్ స్టాఫ్ దీపిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీకి మోసా అప్పలరాజు రాజీనామా

విశాలాంధ్ర - పాయకరావుపేట: బీజేపీ ఉత్తరాంధ్ర జిల్లాల మత్స్యకార సెల్ అధ్యక్షులు మోసా అప్పలరాజు ఆ పార్టీకి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజీనామాను పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఈమెయిల్ పంపినట్లు తెలిపారు. బీజేపీలో మత్స్యకారులకు సరైన న్యాయం జరగకపోవడం, గతంలో మత్స్యకారులకు అన్యాయం చేసిన టీడీపీతో పొత్తు పెట్టుకోవడం, విధి విధానాలు లేని జనసేనతో కలవడం వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కూటమి మేనిఫెస్టోలో మత్స్యకారులకు ప్రాధాన్యత లేదని, మత్స్యకారుల ప్రస్తావనే లేదని అన్నారు. ప్రస్తుతం జాతీయ మత్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న తను ఏ పార్టీలో చేరేది మత్స్యకార నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని మోసా అప్పలరాజు తెలిపారు.

సాదా సీదాగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నామ మాత్రంగా కొనసాగింది. ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయా శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, విద్య, ఆరోగ్య, నీటిపారుదల, గృహనిర్మాణ తదితర శాఖాధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలాభివృద్ధికి అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలన్నారు. ప్రస్తుతం వేసవికాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, ఎంపీడీవో కీర్తి స్పందన, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో మెళకువలపై సూచనలు

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని శిరిజాం గ్రామంలో శ్రీకాకు ళానికి చెందిన కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులు కే.రూప, పి.పావని, పవిత్ర, సృజన, వెంకటసాయిప్రసన్నలు పలువురు రైతులకు పంటల్లో మెళకువలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే సిబ్బంది డాక్టర్ యన్.రాజ్ కుమార్, యన్.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురు చేరిక

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గుర్రాజుపేట గ్రామంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. పాయకరావుపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వై.వినోద్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం, టిడిపి సీనియర్ నాయకులు నల్లపరాజు వెంకటరాజు, దండు అచ్యుతరామరాజు, చంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో డబ్బు, దౌర్జన్యాలతో గెలుపునకు వైసీపీ ప్రయత్నాలు

విశాలాంధ్ర - ఎలమంచిలి: ఎన్నికల్లో డబ్బు, దౌర్జన్యాలతో గెలవడానికి అధికార వైఎస్ఆర్ పార్టీ ప్రయత్నిస్తుందని తెలగ బలిజ కాపు జాయింట్ యాక్షన్ కమిటీ(టి బి కె జేఏసీ) ఏపీ అండ్ టీఎస్ అధ్యక్షులు దాసరి రాముఅన్నారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేసిన వారిని కొట్టడం, నామినేషన్ వేయకుండా బెదిరించడం వంటి దౌర్జన్యాలకు అధికార పార్టీ ప్రయత్నిస్తుంది అన్నారు. ఇసుక ద్వారా 20 వర్గాలకు చెందిన ప్రజలు బతుకుతున్నారని అటువంటి ఇసుక హైదరాబాద్ చెన్నై ప్రాంతాలకు తరలిపోతుందని ఏపీలో దొరకడం లేదన్నారు. అప్పులు తెచ్చి పరిపాలన సాగిస్తున్నారని అప్పు లేకుండా పరిపాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పలేరు అన్నారు. నకిలీ మద్యం తయారుచేసి సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. మద్యం తయారు చేసిన తర్వాత ఎనిమిది రోజులు దానిని స్టోర్ చేసి వదలాలని అటువంటిది పచ్చిమందును మద్యం దుకాణాల్లో అమ్మడం ద్వారా సామాన్యుల ప్రాణాలు కోల్పోతున్నారు అన్నారు. స్థానిక నాయకుడు సుందరపు విజయ్ కుమార్ 20 ఏళ్లుగా ఎలమంచిలి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఎన్నికల్లో ఆయన గెలిపించి శాసనసభకు పంపించాలన్నారు. ఎంపీగా సీఎం రమేష్ ను గెలిపించి మోడీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డొక్కా నాగభూషణం, కాపు సంక్షేమ సంఘం (కే ఎస్ ఎస్) ఉత్తరాంధ్ర ఇన్చార్జి గుర్రాల శ్రీనివాస్, జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు బొద్దపు శ్రీను, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం సోమనాయుడు, ఎలమంచిలి మండలం తూర్పు కాపు సంఘం కార్యదర్శి గొర్ల నానాజీ పాల్గొన్నారు.

మోడ్రన్ మాడుగులగా తయారు చేస్తా

మాడుగుల వైసీపీ అభ్యర్థి ఈర్లె అనురాధ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల ప్రాంతాన్ని మోడల్ గా అభివృద్ధి చేసిన ఘనత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దక్కుతుందని, అతి తక్కువ కాలంలోనే గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించి అనూహ్య రీతిలో అభివృద్ధిని చేసి చూపించిన నాయకుడు ముత్యాలనాయుడు అని, ఆయన ఆదర్శంగా మోడల్ మాడుగులను మోడ్రన్ మాడుగులుగా తీర్చిదిద్దే దిశగా సేవ చేస్తానని మాడుగుల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. అనంతరం గ్రామ గ్రామానికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన మేనిఫెస్టో సువివరంగా వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలేవి నెరవేర్చకుండా నూతనంగా కల్లబొల్లి హామీలతో ప్రజలను మాయ మాటలు చెప్పి మభ్యపెట్టే దిశగా టీడీపీ నేతలు ప్రయత్నం చేస్తున్నారని, ఎన్నడూ లేనివిధంగా నవరత్నాలు తో సహా అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ, వాటిని 99 శాతం అమలు చేస్తూ మరింత మంచి పనులకు శ్రీకారం చుట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించి, తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను ఆమె అభ్యర్థించారు. ఆమె వెంట ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారాం, మాజీ ఎంపీపీ పెదబాబు, మండల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీను, గ్రామల ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలు కుటుంబాలు జనసేనలో చేరిక

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన పలు మత్స్యకార కుటుంబాలు వైసీపీ నుంచి జనసేనలో చేరాయి. సబ్బవరం మండలం మొగలిపురంలో సోమవారం సీఎం రమేష్, గండి బాబ్జి సమక్షంలో పంచకర్ల రమేష్ బాబు వారికి జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థుల విజయానికి శ్రమించి పనిచేయాలని కోరారు. మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు ఆధ్వర్యంలో బొంది కోటేశ్వరరావు, బొంది మహేష్, బొంది పెంటయ్య, మైలపల్లి బంగార్రాజు, మైలపల్లి పోలరాజు, మైలపల్లి ముత్యాలు, మైలపల్లి మసేను, కొరివి తాతయ్య, కొరివి అంకుల్, అర్జిల్లి నూకరాజు, అర్జిల్లి సూరిబాబు, కొరివి నరేష్, కొరివి సోములు, తిత్తి చిన్నారావు, తిత్తి పైడిరాజు, తిత్తి అప్పలరాజు తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వైసిపి నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని బృందావనం కాలనీ తో పాటు పలు వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు చూసి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనిశెట్టి బాబురావు, జిల్లా ప్రచార కమిటీ విభగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా, జగతా శ్రీను, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి సత్య మహేష్, దోమాడ సుందరం, నెలపర్తి నాగరాజు, పిరాధి రాజు, జె. శ్రీను, కే. మధు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు ధర్మావతి నామినేషన్ వెనక్కి

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గంట శ్రీనివాసరావు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలవడం జరిగింది. వారి నివాసంలో మా అందరికీ వారి కుటుంబంతో పాటు బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటుచేశారుఈసందర్భంగాభీమిలినియోజకవర్గంలో ఆనందపురం మండలంలో గంభీరం పంచాయతీ నుండి ఎమ్మెల్యేగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఏలూరి ధర్మావతి గంటా శ్రీనివాసరావు సమక్షంలో మాట్లాడి ఈ రోజు మధ్యాహ్నం వారి యొక్క నామినేషన్ విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ ఆధ్వర్యంలో బిజేపి నాయకులు సమక్షంలో భీమిలి ఆర్డిఓ ఆఫీస్ లో నామినేషన్ ఆమె తీసివేయడం జరిగింది. భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అందరికి అభినందనలు తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: రెడ్డి సంక్షేమ సంఘం పాయక రావుపేట, తుని ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వేసవి తీవ్రత ఎక్కువ ఉంటున్న కారణంగా పాయకరావుపేట గౌతమ్ థియేటర్ వద్ద, తుని గొల్ల అప్పారావు సెంటర్లో రెండు చోట్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రతిరోజు సుమారు 6 వేల మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు సంఘం అధ్యక్షులు కే. కిషోర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.లక్ష్మినారాయణ రెడ్డి, సెక్రటరీ పి. శ్రీనివాస రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కె.వి. రామలింగారెడ్డి, ట్రెజరర్ ఎం. వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, రామారెడ్డి, రాజారెడ్డి, సురేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, కిరణ్ రెడ్డి, అయ్యప్ప రెడ్డి, మణికంత రెడ్డి, శివారెడ్డి, సోమనాథ్ రెడ్డి, భరత్ రెడ్డి, శేషా రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, సంజీవ రెడ్డి, చినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ఉపసంహరించుకున్న పైలా ప్రసాదరావు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల తెలుగుదేశం రెబల్ అభ్యర్థి పైల ప్రసాద్ సోమవారం నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు. అనకాపల్లి పార్లమెంట్ కు, మాడుగుల అసెంబ్లీ కు గాను నామినేషన్ దాఖాలు చేసిన విధితమే. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా మొత్తం సీఎం రమేష్ వేవ్ ఉందన్నారు. ఎక్కడ చూసిన ఆయన పేరే వినపడుతుందన్నారు. మాడుగులలో బండారు సత్యనారాయణమూర్తి గెలువుకు కృషి చేస్తానని చెప్పారు. అనకాపల్లి జిల్లా లో కూటమి అభ్యర్థులు గెలుపు ఒక్కటే ఇప్పుడున్న మా అందరి లక్ష్యమని, కూటమి ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే రామానాయుడు నామినేషన్ ఉపసంహరణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సోమవారం తన నామినేషన్ ను ఉపసంహరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాడుగుల ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి గెలిపించాలని ఉద్దేశ్యంతోనే తన నామినేషన్ ఉపసంహరణ చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీని గెలిపించండి

విశాలాంధ్ర -విశాఖ సిటీ: అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా పేదవాడు అభివృద్ధి లిచెందాలన్నా మరలా ఏపీ ముఖ్యమంత్రిగా జగన్ అన్న పాలన రావాలని వైసీపీ,తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ అన్నారు . ఈ మేరకు 98వరోజు ఎంవిపి కాలనీ,ముువ్వలపాలెం అప్పుఘర్, ముువ్వల పాలెం ,పాదయాత్ర నిర్వహించి ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు చేపట్టిన సంక్షేమము, అభివృద్ధిని కొనసాగాలి అంటే ఈ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి మన జగనన్నను మళ్లీ సీఎం చేయాలని అన్నారు.కావున ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు పేదవాడికి పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఏపీ ముఖ్యమంత్రిగా జగనన్నను మరల ఆశీర్వదించాలని, అలాగే ఇక్కడ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రములో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చంద్ర రాష్ట్ర కార్యదర్శి , పీవి నారాయణ పాల్గొన్నారు.

పైలా చేరికతో టీడీపీలో మరింత జోష్

విశాలాంధ్ర - కే.కోటపాడు: మాడుగుల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైల ప్రసాద్ రావు ఎట్టకేలకు అలక వీడి పార్టీ గెలుపునకు కృషి చేస్తానని ప్రకటించారు. గత ఎన్నో సంవత్సరాలుగా మాడుగుల నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగుదేశం పార్టీలో ముఖ్య నేతగా మెలిగిన పైలా ప్రసాదరావుకు పార్టీ టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకోవడంతో మనస్థాపన చెందిన బైల చివరకు తన అభిమానులు కార్యకర్తలతో చర్చించి నామినేషన్ వెనక్కి తీసుకున్నారు. తన ఎదుగుదలను నాశనం చేసిన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని , తన జీవితకాలంలో నాకు ప్రధాన శత్రువుగా మిగిలిపోతాడు అని ప్రకటించారు. మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం గెలుపునకు తానే ముందుంటానని పార్టీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తికి హామీ ఇచ్చారు. అలాగే అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ ను కలిసి జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో మాడుగుల నుండే అత్యధిక మెజార్టీ సాధిస్తామని అన్నారు. ఈ మేరకు పైలా తన అనుచరులైన కే కోటపాడు మండల పార్టీ అధ్యక్షులు రొంగలి మహేష్ , ఏ కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కు నాయుడు , కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు తదితరులతో సోమవారం చర్చించి పూర్తి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పైలా తన అనుచర గణంతో ఎన్నికల్లో చురుకుగా పాల్గొంటే తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయం అని నాయకులు అన్నారు.

జగన్ కన్ను జనం ఆస్తిపై పడింది

విశాలాంధ్ర - చోడవరం: జనం ఆస్తిపై జగన్ కన్ను పడిందని, ఈ సారి వై.సి.పి. ను గెలిపిస్తే ప్రజల ఆస్తులన్నీ గోవిందా గోవిందా అవుతాయని భారత కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. ప్రజా జీవనానికి భంగం కలిగించే చట్టాలను తక్షణమే రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సి.పి.ఐ.నేత రెడ్డి పల్లి సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఏ.పి. లాండ్ టైటిలింగ్ యాక్టు సాంకేతికంగా 2023 అక్టోబరు 31 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. కొత్త చట్టం ప్రకారం ఆస్తి సర్వే చేసి ఎవరి పేరు మీద నమోదు చేస్తారో వారిదే స్థలం, ఇల్లు, పొలం, గ్రా. వీఆర్వో, ఆర్ఐ, తహశీల్దార్, సివిల్ కోర్టులు, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ, సబ్ రిజిస్ట్రార్, సివిల్ కోర్టులు ఎవరూ వివాదాల్లో జోక్యం చేసుకోలేరని తెలిపారు. అంటే చివరికి కోర్టులు కూడా దాన్ని కాదనలేవని, దీని కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలు, అమాయక రైతాంగం మోసపోయే ప్రమాదం ఉందన్నారు. మీ భూమి సమస్య మీద ఇకపై సివిల్ కోర్టుల్లో దావాలు వేయడం కుదరదని, ఇక ఏ సమస్య అయినా టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ తీరుస్తారని తెలియజేసారు. ఆయనకు తీర్పు నచ్చకపోతే ల్యాండ్ టైటిలింగ్ అప్పీలేట్ ఆఫీసర్ దగ్గరకు వెళ్లాలని, వీళ్లద్దరి తీర్పుతో సంతృప్తి చెందకపోతే నేరుగా హైకోర్టుకే వెళ్లాలని తెలియజేసారు. దీంతో భూ ఆక్రమణ రాబందులు దర్జాగా ఖబ్జా లకు పాల్పడతారన్నారు.

ఈ క్రమంలో నేలను నమ్ముకున్న బడుగు, బలహీనవర్గాలు, సన్న, చిన్నకారు రైతులు ఎక్కువ మోసపోయి, చివరకు అన్నీ నష్టపోతారని తెలిపారు. దీనిపై అధికారిక ప్రభుత్వాలు ప్రజా జీవన విధానానికి భంగం కలిగించే రీతిలో చట్టాలను చేస్తే, మరో పోరాటంతో తగిన బుద్ధి చెబుతామని, ప్రజలందరూ ఓటు అనే ఆయుధంతో ఇటువంటి భూ రాబందులు గద్దెనెక్కకుండగా చూడాలని కోరారు. ఇదే జరిగితే భావి తరాలు ఎవ్వరినీ క్షమించవన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి భగత్‌కు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ మద్దతు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిరిడి భగత్‌కు స్టీల్ ప్లాంట్ ట్రేడ్ యూనియన్స్, స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ, ఎంప్లాయిస్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి దిశలో వెళుతోందని పెందుర్తి నియోజకవర్గం అభ్యర్థిని గెలిపించి ఆమెకు కానుకగా ఇవ్వాలని యూనియన్ నాయకులు ఆకాంక్షించారు. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు కార్యాలయంలో స్టీల్ ప్లాంట్ వర్కర్స్ బ్రోచర్‌ను కూటమి అభ్యర్థులు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెందుర్తిలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న భగత్‌ను భారీ మెజారిటీతో గెలిపించి బీజేపీ, తెలుగుదేశం జనసేన, వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ ద్వారా కార్పొరేటర్లకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్న పార్టీలకు 1200 రోజులుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్న కార్మికులకు మధ్య సవాల్‌గా ఈ ఎన్నికలు నిలుస్తాయని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌ను రక్షించే దిశగా పోరాటాలు చేస్తున్న వారిని గెలిపించుకోకపోతే భవిష్యత్తులో మనకోసం నిలబడే వారు ఎవరూ ఉండరని యూనియన్ నాయకులు తెలిపారు. ఇండియా కూటమి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి సత్య రెడ్డి, అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి వెంకటేష్, పెందుర్తి నియోజకవర్గం అభ్యర్థి భగత్ పిరిడి, గాజువాక నియోజకవర్గం అభ్యర్థి జోగు నాయుడు సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారానికి వస్తే న్యాయం జరుగుతుందని, స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ చేస్తున్న బిజెపి దాని మిత్రపక్షాలు, వైసీపీలు ఇక్కడ గెలిస్తే ఉక్కు ఉద్యమం అవహేళనకు గురవుతుందని, విశాఖ నగరంలో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

సింహాద్రి అప్పన్న సాక్షిగా పంచ గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర- పెందుర్తి: సింహాద్రి అప్పన్న సాక్షిగా పంచ గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎన్డీఏ కూటమి పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. జీవీఎంసీ 93,94 వార్డుల్లో సోమవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గండి బాబ్జి, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు సోదరుడు శ్రీనివాస నాయుడు, బిజెపి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు, స్థానిక టిడిపి కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావులతో కలిసి విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం స్థానిక కళ్యాణమండపంలో నిర్వహించిన టిడిపి జనసేన బిజెపి శ్రేణులను ఉద్దేశించి రమేష్ బాబు మాట్లాడుతూ పంచ గ్రామాల సమస్య పరిష్కారం కోసం తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఎంతో కృషి చేశానని, పేదల నివాసాలను లాక్కునేందుకు ప్రయత్నించిన అధికారులతో పోరాటం చేశానని గుర్తు చేశారు. అయితే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేసిన రమేష్ బాబు వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అదీప్ రాజు పైన ఆయన తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. అడ్డగోలుగా వేల కోట్లు దోచుకున్న అదీప్ రాజ్, తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకపోవడంతో స్థానికత గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బిజెపి నాయకుడు శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విడిపోకూడదనే లక్ష్యంతో పార్లమెంట్లో ఎంతో పోరాటం చేసిన గొప్ప నాయకుడు సీఎం రమేష్ అని పేర్కొన్నారు. అలాగే కడప స్టీల్ ప్లాంట్ కోసం నిరాహార దీక్ష చేపట్టి ప్రభుత్వం మెడలు వంచారని గుర్తు చేశారు. సీఎం రమేష్ ఎంపీగా గెలిస్తే అనకాపల్లి జిల్లా రూపురేఖలే మారుతాయి అని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ కన్నా మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఈ ప్రాంతంలో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను ప్రస్తావించి వాటిని పరిష్కరించాలని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, టిడిపి బిజెపి జనసేన ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయన్ను ముంచుతారా...? తేలుస్తారా...?

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి చందనయాత్ర (నిజరూప దర్శనం) ప్రస్తుత ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాలత, జిల్లా యంత్రాంగం తో జరుగుతుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. మొన్న స్వామివారి వార్షిక తిరు కల్యాణం ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగింది. 2008 లో అప్పటి ఈ.ఓ శంకర్ రెడ్డి ఇక్కడి నుండి బదిలి అయిన తరువాత అనేక మంది కార్యనిర్వాహణాధకారులు దివంగత సి. ప్రేమ్ కుమార్(దేవాదాయ శాఖ), సి. హెచ్ నరసింగరావు (రెవెన్యూ), ఎం. వేంకటేశ్వరరావు(రెవెన్యూ), ఎం.వి సూర్యకళ (రెవెన్యూ), గత ఏడాది ఇంచార్జ్ ఈఓ వి. త్రినాథరావు (దేవాదాయ శాఖ) సహా ఏదో ఆరోపణల తోనే సింహాచలం దేవస్థానం నుండి బదిలి అయిన సంగతి పాఠకులకు విదితమే. ముఖ్యంగా అధిక శాతం ఈ.ఓ లు వార్షిక ఉత్సవాల్లో ఆరోపణలు ఎదుర్కొని బదిలి అయ్యారు. అందుచేత నే ఈ దేవస్థానంలో శాస్వత ఈ. ఓ గా రావాలంటే భయపడుతున్నారని బోగట్ట. ముఖ్యంగా ఇక్కడ వివిధ విభాగాల నుంచి వర్గ పోరు ఉన్న సంగతి పాఠకులకు తెలిసిందే. సింహాచలం దేవస్థానంకు కార్యనిర్వణాధికారిగా వద్దామని అనుకుంటే అయనకు ఇదే దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అయ్యా తమరు ఇక్కడకు వస్తే మీకు పెన్షన్ రాదు సరికదా నిందలు వస్తాయేమో అని సలహా, సూచన ఇచ్చి ఇదంతా ఇక్కడ మీడియా మంచిది కాదని విలేఖరుల పై లేని పోని ఆరోపణలు చెప్పి ఆయన్ను భయపెట్టి నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మే 10న చందనోత్సవం కు మీడియా ప్రతినిధుల పై చెవిలో ఏదో నూరిపోసినట్లు , అందుకు ఆయన డి.పి ఆర్ ఓ, కలెక్టర్, పోలీస్ కమిషనర్ కు ప్రత్యేక మైన అంక్షలు విధిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కానీ ఇప్పటి వరకు ఎటువంటి మచ్చ లేని ఈఓను ఎందులో, ఏవిధంగా ఇరికించి ఆరోపణ లకు గురి చేస్తారేమోనని కొంత మంది అధికారులు, సిబ్బంది, స్థానికుల్లో గుస గుసలు వినిపిస్తున్నాయి.

దివ్యాంగుల క్రికెట్‌ను ప్రోత్సహిస్తున్న ఏసీఏ

విశాలాంధ్ర - పీఎం పాలెం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సహకారంతో ఆంధ్ర క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ డిసేబుల్డ్ రెండు రోజుల పాటు నిర్వహించనున్న దివ్యాంగుల అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ వైజాగ్‌లోని డా. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీఏ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.ఎం.ఎన్.రోహిత్ మాట్లాడుతూ దివ్యాంగులను క్రికెట్‌పరంగా ప్రోత్సహించేందుకు వీలుగా రెండు రోజుల పాటు మ్యాచ్ నిర్వహణ కోసం ఏసీఏ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి క్రీడాకారులకు అవసరమైన వసతి, భోజనంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు కల్పించారని అన్నారు. ఆటగాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. ఏసీఏ విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా మొట్ట మొదటి సారిగా దివ్యాంగుల కోసం టోర్నమెంట్ నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని టాలెంట్ నిరూపించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏసీఏ విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ సభ్యులు ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.